క్లుప్తంగా

టీటీడీ ఉగాది పంచాంగం పంపిణీ



టీటీడీ పంచాంగం అందుకున్న అర్చకులు

కడప కల్చరల్: నగరంలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో నగరానికి చెందిన పలువురు అర్చకులకు ఆదివారం ఉగాది పంచాంగాలు పంపిణీ చేశారు. జిల్లా అర్చక సంఘం అధ్యక్షుడు పిడతల గోపీశర్మ, ఏపీ పురోహిత సమాఖ్య గౌరవ అధ్యక్షుడు బ్రాహ్మణపల్లి చంద్రమౌళిశర్మ, తదితరులు అర్చకులకు వాటిని అందజేశారు.

ఎన్జీఓ హౌస్ బిల్డింగ్ సొసైటీ డైరెక్టర్ల నిరసన



సొసైటీ వద్ద నిరసన తెలుపుతున్న డైరెక్టర్లు

కడప రూరల్: జిల్లా ఎన్జీఓ హౌస్ బిల్డింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం వాయిదా వేయడంతో ఆ సంస్థ కార్యాలయం ఎదుట కసొసైటీ డైరెక్టర్లు ఆదివారం నిరసన తెలిపారు. డైరెక్టర్ రమేష్‌కుమార్ మాట్లాడుతూ సొసైటీ ఆహ్వానం మేరకు సభ్యులు, డైరెక్టర్లు వచ్చారని, కోరం లేదని సమావేశం వాయిదా వేయడం తగదన్నారు. హౌస్ బిల్డింగ్ ప్రగతికి, సభ్యుల అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వల్లెంసుబ్బారెడ్డి, శివశంకర్, మునెయ్య, ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

రామకృష్ణ నగర్‌లో మౌలిక వసతులు కల్పించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: నగరంలోని రామకృష్ణ నగర్‌లో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ పేర్కొన్నారు. సీపీఎం ప్రచార చైతన్య యాత్రలో భాగంగా నగరంలోని రామకృష్ణ నగర్‌లో ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ అధికారులు ఆస్తి, నీటి పన్నులు ముక్కుపిండి వసూలు చేస్తున్నా.. మౌలిక వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి ఇచ్చిన హామీలు అమలుచేయలేదన్నారు. ఈ ప్రాంతంలో నాలుగు రోజులకోసారి తాగునీరు సరఫరా అవుతోందన్నారు. అర్ధరాత్రి సమయంలో విడుదల చేయడంతో ప్రజలు నిద్ర లేక ఇబ్బందిపడుతున్నారని తెలిపారు. గంగమ్మ ఆలయం వద్ద ప్రభుత్వ స్థలం కబ్జా చేస్తుంటే రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారని తెలిపారు. దస్తగిరిరెడ్డి, వెంకటేశ్వర్లు, నరసింహ తదితరులు పాల్గొన్నారు

పదోన్నతులు కల్పించాలి

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రంలో ఏకీకృత సర్వీస్ రూల్స్‌ను అమలు చేసి అన్ని కేడర్లకు పదోన్నతులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) రాష్ట్ర అధ్యక్షుడు శవన్న గారి బాలాజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కడపలోని ఆపస్ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు రూ.6200 కోట్లు మాత్రమే ప్రకటించడం ఏ మాత్రం సరిపోదన్నారు. మిగిలిన ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ విధానం వర్తింప చేయాలన్నారు. దీంతోపాటు 12వ పీఆర్‌సీ చైర్మన్‌ను నియమించి 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాంజనేయప్రసాద్ మాట్లాడుతూ మోడల్ ప్రైమరీ స్కూల్స్‌లో సుదూరంగా ఉన్న పాఠశాలల నుంచి 3, 4, 5 తరగతులను విలీనం చేస్తే అనేక ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. జిల్లా అధ్యక్షుడు చెన్నయ్య మాట్లాడుతూ రాబోయే నెలలో పదోన్నతులు, బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కొండారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకట్రామిరెడ్డి, జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, శ్రీనివాసులు, నారాయణరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

భక్తుల జేబులకు చిల్లు

కడప కార్పొరేషన్: గంగమ్మ జాతరను ఆసరాగా తీసుకుని ఆలయ సిబ్బంది, దేవాదాయ శాఖ అధికారులు భక్తుల జేబులకు చిల్లులు వేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. చింతకొమ్మదిన్నె మండలం బుగ్గలేటిపల్లె సమీపంలోని గంగమ్మ గుడిలో ఏటా మార్చిలో గంగమ్మ జాతర జరుగుతుంది. భక్తులు వందల సంఖ్యలో తరలివచ్చి జంతుబలులు ఇచ్చి అమ్మవారికి నైవేద్యం పెట్టి మొక్కులు తీర్చుకుంటారు. భక్తుల సంఖ్య గణనీయంగా పెరగడంతో ఆలయ పరిసర ప్రాంతాల్లో కొంతమంది దాతలు గదులు నిర్మించి ఫ్యాన్లు వేయించారు. భక్తులకు గతంలో వీటిని నామమాత్రపు ధరలకు అద్దెకిచ్చారు. ఇటీవల దేవాదాయశాఖ వాటిని స్వాధీనం చేసుకోవడంతో పరిస్థితులు మారిపోయాయి. గదులను ఎంత ధరకు అద్దెకిస్తున్నారో షామియానా, వంట సామగ్రి, డ్రమ్ములు, టేబుళ్లు, కుర్చీలకు ధరలు ముక్కుపిండి వసూలు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఒక్కో గదిని రూ.800 నుంచి రూ.1000 రూపాయల వరకు అద్దెకిస్తున్నారు. రద్దీని దృష్టిలో పెట్టుకొని కృత్రిమ కొరత సృష్టించి ధరలు పెంచుతున్నారనే ఆరోపణలున్నాయి. తమకు నచ్చిన వారికి ఒకరకంగా మరొకరికి ఇంకోరకంగా ధరలు నిర్ణయించి వసూలు చేస్తున్నట్లు సమాచారం.

స్కౌట్ శిక్షణ.. సేవకు నిచ్చెన!

విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జాతీయ సమైక్యత అలవర్చేలా విద్యార్థి దశ నుంచే సమాజంపై బాధ్యతతో వ్యవహరించేలా శిక్షణ ఇచ్చే సంస్థ 'భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్'. ఇందులో ప్రవేశించే విద్యార్థులకు చక్కటి మార్గదర్శనం చేసి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో కీలకంగా వ్యవహరించే 'పెట్రోల్ లీడర్స్' కార్యక్రమం కడపలో ప్రారంభమైంది. ఐదు రోజులు నిర్వహిస్తున్న ఈ రెసిడెన్షియల్ కార్యక్రమంలో రోజుకో అంశంపై శిక్షణ ఇస్తూ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతోంది భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్.

- కడప నగరంలో 5 రోజుల ప్రత్యేక శిబిరం
- పీఎంశ్రీ పాఠశాలల విద్యార్థులకు శిక్షణ



శిక్షణకు హాజరైన విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాంతీయ శిక్షణ కార్యాలయంలో పీఎంశ్రీ పాఠశాలల విద్యార్థులకు 'పెట్రోల్ లీడర్స్' శిక్షణ కార్యక్రమం ఈ నెల 21న ప్రారంభమైంది. ఈ నెల 25వ తేదీ వరకూ నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో జిల్లాలోని 42 పాఠశాలలకు చెందిన దాదాపు 200 మంది స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి డి. ప్రమీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో పలు అంశాలపై శిక్షణ ఇస్తున్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ ముఖ్య ఉద్దేశ్యం: నాయకత్వ నైపుణ్యాలను అభివృద్ధి చేయడమే స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ కార్యక్రమ ఉద్దేశ్యం. రోజూ ఉదయం ప్రారంభమయ్యే దినచర్య రాత్రి వరకూ కొనసాగుతుంది. అసెంబ్లీ నిర్వహణ, ప్రేయర్, ఫ్లాగ్ ఆవిష్కరణలతోపాటు వివిధ రకాల స్కౌట్ నైపుణ్యాలపై శిక్షణ ఇస్తున్నారు. పాట్రోల్ సిస్టం, బుడ్డీ వర్క్, సెరేమనీ విజిల్స్, గ్రూప్ సిస్టం, ఫండమెంటల్స్ ఆఫ్ స్కౌటింగ్, ప్రామిస్ అండ్ లా, గేమ్స్, హాబీస్ పాటు స్కౌట్స్ గొప్పదనం, ఉపయోగాలు తెలియజెప్పేలా ప్రత్యేక ఉపన్యాసాలు శిక్షణలో ఉన్నాయి. జట్టు కృషిని మరియు సహకారాన్ని ప్రోత్సహించడం, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించడం, శారీరక దృఢత్వం, బహిరంగ కార్యకలాపాలను ప్రోత్సహించడం, జీవన నైపుణ్యాలను నేర్చుకోవడం, సమాజ సేవా భావాన్ని పెంపొందించడం, సాంస్కృతిక అవగాహనను అభివృద్ధి చేయడం, వ్యక్తిగత వృద్ధికి అవకాశాలను అందించడంపై శిక్షణ కొనసాగిస్తున్నారు.

సేవాభావాన్ని పెంపొందించడమే లక్ష్యం



విద్యార్థి దశ నుంచే సమాజం పట్ల సేవాభావాన్ని పెంపొందించడమే భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ లక్ష్యం. ఈ క్యాంపులో ఒక్కో ప్రత్యేక అంశంపైన సమగ్రంగా శిక్షణ ఇస్తున్నాం. ఆరోగ్యం, ప్రథమ చికిత్స, పరిశుభ్రత, టీంవర్క్, క్యారెక్టర్ బిల్డింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నాం. – డి. ప్రమీల, జిల్లా కార్యదర్శి, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, కడప

సేవ చేసే అవకాశం లభిస్తుంది



భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో లో చేరడం ద్వారా సమాజానికి చేతనైన సాయం చేసే అవకాశం లభిస్తుంది. దీంతోపాటు నాయకత్వ లక్షణాలు అలవడతాయి. స్కౌట్స్‌లో చేరడం ద్వారా భవితకు బాటలు వేసుకుంటున్నా. – ఎస్.దీన, డా.బీఆర్.అంబేద్కర్ గురుకులం, తొండూరు

నాయకత్వ లక్షణాలు అలవడతాయి



స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరడం ద్వారా నాయకత్వ లక్షణాలు అలవడతాయి. ఈ కార్యక్రమాల్లో పాల్గొనడంతో చదువుకు ఏమాత్రం ఆటంకం కాదు. బాగా రాణిస్తే పురస్కారాలు అందుకొనే అవకాశం ఉంది. – టి.ఆరాధ్య, డా.బీఆర్. అంబేద్కర్ గురుకులం, కమలాపురం

కొత్త విషయాలు తెలుసుకుంటున్నాం



పెట్రోల్ లీడర్స్ శిక్షణ శిబిరంలో చాలా కొత్త విషయాలు తెలుసుకునే అవకాశం లభిస్తోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక కార్యక్రమాలు చక్కగా సాగుతున్నాయి. జట్టు కృషిని, సహకారాన్ని ప్రోత్సహంచడం నేర్పిస్తున్నారు. – సి.చంద్ర, జెడ్పీ హైస్కూల్(బాలురు), యర్రగుంట్ల

టీం వర్క్ అలవడేలా..



జట్టుగా పనిచేయడం ద్వారా ఏపనైనా సులువుగా పూర్తిచేసే అవకాశం ఉంటుంది. అలాంటి టీం వర్క్‌ను శిక్షణలో నేర్చుతున్నారు. క్యాంపు చక్కగా సాగుతోంది. శారీరక దృఢత్వం, బహిరంగ కార్యకలాపాలను ప్రోత్సహించడం నేర్పుతున్నారు. – ఎం. చందు, ఎంపీయూపీఎస్, లక్ష్మిపాలెం, బద్వేలు

తెలుగు స్కాలర్‌కు డాక్టరేట్



రంగస్వామి

కడప ఎడ్యుకేషన్: యోగివేమన విశ్వవిద్యాలయం తెలుగుశాఖ స్కాలర్ మద్దసాని రంగస్వామికు వైవీయూ డాక్టరేట్ ప్రకటించింది. ఆయన 'రాయలసీమ ఆధునిక కవిత్వం– అధ్యయనం (1951 నుంచి 1980 వరకు)' అనే అంశంపై పరిశోధన చేసినందుకు ఈ గౌరవం లభించింది.

దాహార్తి తీర్చడం పుణ్యకార్యం

కడప కోటిరెడ్డిసర్కిల్: ప్రజల దాహార్తి తీర్చడం పుణ్యకార్యమని కడప ట్రాఫిక్ సీఐ జావీద్ తెలిపారు. కడప నగరంలోని వినాయకనగర్ వద్ద కృతి ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ కుశెట్టి నాగేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీఐ జావీద్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండు వేసవిలో ఏర్పాటు చేసే చలివేంద్రాలు ప్రజలను ఎంతగానో ఆదుకుంటున్నాయన్నారు. దాతలు తమ సేవా కార్యక్రమాల్లో భాగంగా చలివేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాలన్నారు. ఈ సందర్భంగా వంద మందికి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు, స్థానికులు పాల్గొన్నారు.

త్వరలో యునెస్కో తాత్కాలిక జాబితాలో గండికోట



మీడియాతో మాట్లాడుతున్న లయన్ కె.చిన్నపరెడ్డి

కడప కల్చరల్: గండికోట పర్యాటక ప్రాంతాన్ని యునెస్కో తాత్కాలిక జాబితాలో త్వరలో చేర్చే అవకాశం ఉందని ఇన్‌టాక్ జాతీయ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు లయన్ కె.చిన్నపరెడ్డి ఆదివారం తెలిపారు. చిన్నపరెడ్డి తన పదవి పొందిన తర్వాత జిల్లాకు వచ్చిన సందర్భంగా ఇన్‌టాక్ సభ్యులు కార్ ర్యాలీ నిర్వహించి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇంటాక్ పక్షాన ఉగాది సంప్రదాయంలో భాగంగా నగరంలోని పలువురు అర్చకులకు ఉచితంగా పంచాంగాలు అందజేశారు.

ముచ్చల సందడి



మాట్లాడుతున్న ఎంపీ రామచంద్రారెడ్డి

కడప కల్చరల్: ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా స్థానిక చిన్న చౌక్‌లోని జీఆర్‌టీ జీవీకే పాఠశాల విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. మిస్సా మూవీ వారి సహకారంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రాచుర్యం పొందిన సినీ గీతాలకు ఉత్సాహంగా ప్రదర్శించిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రేక్షకులు ఉత్సాహంగా చప్పట్లు కొడుతూ ప్రోత్సహించారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ.రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులకు తరగతి పట్టాలు పంపిణీ చేశారు. విద్యార్థులు ఉన్నత విద్యావంతులు కావాలని, తల్లిదండ్రుల శ్రమను గుర్తించాలని సూచించారు.

కిడ్నాప్ కలకలం..

కడప అర్బన్ : కడప నగరం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చిలకలబావి సమీపంలో ఆదివారం ఐదుగురు యాచకులను స్థానిక ప్రజలంతా కలిసి కిడ్నాపర్‌లనే అనుమానంతో చితకబాదారు. పోలీసులు తెలుసుకుని పోలీస్ స్టేషన్‌కు తమ వెంట తీసుకుని వెళ్లారు. పోలీసులు విచారించిన తరువాత వదిలేశారు.

రంజాన్ శుభాలు అందరికీ అందాలి



సుబాన్‌బాషకు ఖర్జూరాన్ని తినిపిస్తున్న అంజద్‌బాష

మాజీ ఉపముఖ్యమంత్రి ఎస్‌బీ.అంజాద్‌బాషా

కడప కల్చరల్: పవిత్ర రంజాన్ మాసం శుభాలు అందరికీ అందాలని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజాద్‌బాషా అన్నారు. కడప నగర శివారులోని మాచుపల్లి దర్గాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సుభాన్‌బాషా ఆధ్వర్యంలో ఆదివారం ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ సందర్భంగా అంజాద్ బాషా మాట్లాడుతూ రంజాన్ మాసంలో ముస్లిలందరూ 30 రోజులపాటు ఎంతో నిష్టగా ఉపవాసం ఉంటారని, ప్రత్యేక ప్రార్థనలు చేస్తూ అల్లాహ్ కృప కటాక్షాల కోసం కృషి చేస్తారని తెలిపారు. ఈ మాసంలోని పవిత్రతను గుర్తించి అల్లాహ్ సూచించిన మార్గంలో నడవాలన్నారు. రాష్ట్ర ప్రజలకు పవిత్ర రంజాన్ పండగ ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ హజ్ కమిటీ చైర్మన్ గౌసులాజం, నాయకులు కాల్ టాక్స్ హాఫీజుల్లా, కార్పొరేటర్లు మహమ్మద్ రఫీ, చాక్లెట్ గౌస్,అలీ అక్బర్, షంషీర్, మహమ్మద్ షఫీ, పవర్ అల్తాఫ్, చాంద్ బాషా, బీహెచ్.ఇలియాస్, జమీల్, రిజ్వాన్, చాన్‌అలీ, సైపుద్దీన్, ఫర్వేజ్, గయాజ్, అన్వర్, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో మహిళలకు ఇఫ్తార్

కడప కల్చరల్: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని జమా అతె ఇస్లామి హింద్ పక్షాన మహిళా విభాగం కడప నగరంలో ఆదివారం ఇఫ్తార్ నిర్వహించింది. సంస్థ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో దివ్య ఖురాన్ మానవాళికి మార్గదర్శనంగా ఉండేందుకే అవతరించిందని సంస్థ మహిళా విభాగం అధ్యక్షులు తాహీర అన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ వైజయంతి, డాక్టర్ శశికళ, జమా అతె ఇస్లామి హింద్ ప్రొద్దుటూరు విభాగం నాయకులు అయేషాలు మాట్లాడారు. సమాజంలో మనుషుల మధ్య మంచి వాతావరణాన్ని నెలకొల్పేందుకు, మంచిని పెంచేందుకు ఈ మాసం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రంజాన్ మాసం విశిష్ఠతను, ఉపవాసాల లక్ష్యాన్ని వివరించారు. కార్యక్రమంలో సంస్థ మహిళా ప్రతినిధులతో, కులమతాలకు అతీతంగా మహిళలు పాల్గొన్నారు.



ఇఫ్తార్‌లో పాల్గొన్న మహిళలు

సహజ సౌందర్యానికి చిరునామా శేషాచలం కొండలు



రాఘవశర్మను సత్కరిస్తున్న బ్రౌన్ కేంద్రం ప్రతినిధులు

కడప కల్చరల్: శేషాచలం కొండలు సహజ సౌందర్యానికి సరైన చిరునామాగా అందరినీ ఆకట్టుకుంటున్నాయని తిరుపతి పాత్రికేయులు రాఘవశర్మ అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెలనెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా ఆది వారం 142వ సదస్సు నిర్వహించారు. 'తిరుమల దృశ్యకావ్యం – పర్యాటక విశేషాలు' అంశంపై ఆయన మాట్లాడుతూ జలపాతాలు, లోయలు, కొండలు, వివిధ రకాల వృక్షాలు, జంతువులతో శేషాచలం కొండలు ప్రకృతి సౌందర్యానికి ప్రతీకగా నిలిచాయన్నారు. రామకృష్ణ తీర్థం, తుంబురు తీర్థం, కుమారధార, చక్రతీర్థం, శేషతీర్థం, గుంజన జలపాతం, విష్ణుగుండం, నారాయణ తీర్థం, దశావతార తీర్థం, మార్కండేయ తీర్థం లాంటి ప్రదేశాలకు వెళ్ళే మార్గాన్ని తెలుపుతూ అక్కడి విశేషాలను ఆయన వివరించారు. కార్యక్రమ ప్రారంభంలో రాఘవ శర్మను డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, ఎస్.రమేశ్‌రావు, జి.హరిభూషణరావు, ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక, సిబ్బంది సత్కరించి పూల మొక్క బహూకరించారు. కార్యక్రమంలో పలువురు సాహితీవేత్తలు, సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

కులం, మతం, డబ్బు పేరుతో విడిపోవద్దు



మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

కడప సెవెన్‌రోడ్స్: కులం, మతం, డబ్బు పేరుతో సమాజం నుంచి విడిపోవద్దని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు ఎస్.రామచంద్రారెడ్డి కోరారు. నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్వహించిన ఆ సంస్థ నెలవారి సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజం నుంచి విడిపోయే పరిస్థితులు మేధావులు కల్పించరాదన్నారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని కోరారు. అభివృద్ధి పేరుతో అడవులను నాశనం చేయడంతో ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుందన్నారు. మానవత సంస్థ సభ్యులు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. కేంద్ర కమిటీ సభ్యుడు డాక్టర్ రామాంజులురెడ్డి మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో వేసవిలో చల్లనీళ్లు, మజ్జిగ పంపిణీకి చర్యలు చేపడుతున్నారని తెలిపారు. బైరెడ్డి రామకృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, బోగా చిన్నయ్య, శ్రీనివాసరాజు, గోపి పాల్గొన్నారు.

24 గంటల వ్యవధిలోనే రెండు చోరీలు

కడప అర్బన్ : కడప తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో నబీకోటలో 24 గంటలు గడవక మునుపే రెండు చోరీలు జరిగాయి. నబీకోటలోని రాముని దేవాలయం ఎదురుగా ఉన్న ఓ ఇంటిలో ఈనెల 21వ తేదీన రాత్రి గుర్తు తెలియని దుండగులు ప్రవేశించి బంగారు ఆభరణాలను, ఇతర వస్తు సామగ్రిని తీసుకుని వెళ్లారు. అలాగే ఆదివారం మధ్యాహ్నం 3:30 గంటల సమీపంలో పట్టపగలు ఇద్దరు వ్యక్తులు ఓ ఇంటిలోకి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. పట్టపగలే చోరీలు జరుగుతుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పోలీసులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

యువతకు ఆదర్శం భగత్‌సింగ్



భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న ఓబులేస్ యాదవ్



భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

కడప సెవెన్‌రోడ్స్: స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ యువతకు ఆదర్శమని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రవి పేర్కొన్నారు. భగత్‌సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా నగరంలోని ప్రకాశ్ నగర్ ఎస్సీ హాస్టల్‌లో ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ అతి చిన్న వయస్సులోనే దేశ సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు తెగించి బ్రిటీషు సామ్రాజ్యవాదులతో భగత్‌సింగ్ పోరాడారన్నారు. భగత్‌సింగ్‌తోపాటు రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ప్రాణాలర్పించారని తెలిపారు. నేటి ఎన్డీయే పాలకులు భగత్‌సింగ్ ఆశయాలను నీరుగార్చే విధానాలను అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. రాజ్యాంగ విలువలు హరిస్తూ లౌకిక వాదాన్ని దెబ్బతీసే కార్యకలాపాలు చేపడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నగర అధ్యక్షుడు జాలా సుమంత్, నాయకులు అఖిలేష్, ధన, రాజు, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

'సీమ' అభివృద్ధికి కలిసి పోరాడుదాం

తెల్ల దొరలను గడగడలాడించి వారి వెన్నులో వణుకు పుట్టించిన అమరవీరుడు భగత్‌సింగ్ స్ఫూర్తితో రాయలసీమ అభివృద్ధి కోసం పాలక ప్రభుత్వాలపై పోరాటం చేయాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని ఐఎంఏ హాల్‌లో ఆది వారం భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి తెలుగు రాష్ట్రాన్ని పాలించిన సీమ నేతలు తమ అధికారాన్ని కాపాడుకొనేందుకు కోస్తా, తెలంగాణలను అభివృద్ధి చేసి రాయలసీమను నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత కూడా అన్యాయమే జరుగుతోందన్నారు. సీమ వాసులు గమనించి న్యాయం కోసం పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, శ్యామ్, డాక్టర్ రాజా వెంగళరెడ్డి, డాక్టర్ ఓబుల్‌రెడ్డి, ఆర్‌సీపీ నాయకుడు ప్రసాద్, గద్దం శ్రీను, ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘ నాయకులు రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెల్ల దొరలను గడగడలాడించారు

కడప ఎడ్యుకేషన్: బ్రిటీష్ సామ్రాజ్యవాదాన్ని గడగడలాడించిన విప్లవ యువ కిశోరాలు సర్దార్ భగత్ సింగ్, రాజ్ గురు సుఖదేవ్ అని ఆర్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం. ఓబులేసు యాదవ్ అన్నారు. కడప ఇంటిగ్రేటెడ్ గర్ల్స్ హాస్టల్‌లో భగత్‌సింగ్ వర్ధంతి ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఓబులేసు యాదవ్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం చిరునవ్వుతో ఉరికొయ్యను ముద్దాడిన భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ నేటి విద్యార్థులకు స్ఫూర్తి అన్నారు. పార్లమెంట్‌లో పొగబాంబు వేసి బ్రిటీష్ దొరలకు వ్యతిరేకంగా కరపత్రాలు చల్లి వందేమాతరం నినాదాన్ని వినిపించిన విప్లవ కిశోరం భగత్‌సింగ్ అన్నారు. ఆయన స్ఫూర్తితో రానున్న రోజుల్లో డ్రగ్స్ రహిత సమాజం, అందరికీ చదువు, సామాజిక సేవా కార్యక్రమాలతో యువత ముందుకు నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో బాబు, రామాంజనేయులు, మేషక్‌బాబు, పవన్‌కుమార్, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు

పోరాటయోధుడు భగత్ సింగ్

బ్రిటీష్ సామ్రాజవాదానికి వ్యతిరేకంగా దేశానికి స్వాతంత్రం కావాలని పోరాటం చేసిన యువ కెరటం భగత్‌సింగ్ అని ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, రెవల్యూషనరీ యూత్ ఫ్రంట్ జిల్లా కన్వీనర్ ఆనంద్ అన్నారు. కడప నగరంలోని 17కేఫ్ మినీ ఫంక్షన్ హాల్ నందు కామ్రేడ్స్ భగత్ షింగ్ రాజగురు సుఖదేవుల వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గోపి, సురేష్, నరసింహ, ప్రకాష్, సురేష్, ఆనంద్, పాల్గొన్నారు.

భగత్‌సింగ్ వర్ధంతి

23 ఏళ్ల వయసులోనే తన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన భగత్ సింగ్ నేటి విద్యార్థి, యువజనులకు ఆదర్శప్రాయమని అఖిల భారత విద్యార్థి బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్, అఖిల భారత మహిళా సమితి రాష్ట్ర అధ్యక్షురాలు కోటపాటి సుబ్బమ్మ పేర్కొన్నారు. షాహిద్ భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా కడప ఓంశాంతి నగర్ ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కార్యాలయంలో భగత్ సింగ్ వర్ధంతి ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ భగత్ సింగ్ ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదంతో స్వేచ్ఛాకాంక్ష రగిల్చి, స్వరాజ్య సాధన పోరాటంలో చిరు ప్రాణాలర్పించారన్నారు. కార్యక్రమంలో అరుణ కుమారి, అఖిల్, ప్రణయ్ పాల్గొన్నారు.

- నిరుద్యోగులపై ట్రంప్ దురహంకారానికి వ్యతిరేకంగా యూజీసీ ముసాయిదా డ్రాఫ్ట్ సవరణ వ్యతిరేకిస్తూ కామ్రేడ్ భగత్‌సింగ్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. పీడీఎస్, యూపీవైఎల్ ఆధ్వర్యంలో కడప పీడీఎస్‌యూ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో భగత్‌సింగ్‌కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో షమీముల్లా, గణేష్, మనోజ్, గౌరీశంకర్ పాల్గొన్నారు.
- పీఆర్‌ఎస్‌వైఎఫ్ ఆధ్వర్యంలో విప్లవ ఉత్తేజం భగత్‌సింగ్ వర్ధంతిని కడప ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో ఘనంగా నిర్వహించారు. పీఆర్‌ఎస్‌వైఎఫ్ జిల్లా కన్వీనర్ ఒరగంటి నాగేంద్రబాబు, వేణు, వెంకటేష్ పాల్గొన్నారు.
- కడప నగరంలోని ప్రభుత్వ బీసీ వసతి గృహంలో ఆర్‌ఎస్‌యూ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్, హరిబాబు, సందీప్, కిరణ్, సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

విప్లవ వీరుల వర్ధంతి



నివాళులర్పిస్తున్న డీసీసీ బ్యాంకు సిబ్బంది

కడప అగ్రికల్చర్: భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో విప్లవ వీరులు భగత్‌సింగ్, శివరాం రాజ్‌గురు, సుఖదేవ్ థాపర్ త్యాగం మరువలేనిదని డీసీసీ బ్యాంకు ఓఎస్‌డి గుర్రప్ప అన్నారు. కడప డీసీసీ బ్యాంకులో ఆదివారం భగత్‌సింగ్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా గుర్రప్ప మాట్లాడుతూ విప్లవ వీరులను బ్రిటీష్ ప్రభుత్వం లాహోర్ సెంట్రల్ జైలులో ఉరితీసిందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ బ్యాంకు అధికారులు అంజనేయులు, నరసయ్య, ఆశోక్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.